‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

పాలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ | ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరితి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

బురదలో బైఠాయించిన నగునూరి సుమలత -రాజు (ఫైల్)

బురదలో బైఠాయించి.. రోడ్డు వేయించి..

ప్రస్తుతం డివిజన్‌లో పూర్తయిన రోడ్డును చూపిస్తున్న మాజీ కార్పొరేటర్

- పట్టుబట్టి సాధించుకున్న నగునూరి సుమలత
- నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు

కోల్‌సిటీ, జనవరి 31: రామగుండం నగర పాలక సంస్థ 25వ డివిజన్ మహిళా మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత తన పదవి కాలంలో బురద నీటిలోబైఠాయించి రోడ్డు వేయించారు. ఆ డివిజన్ పరిధిలోని పద్మావతీ కాలనీలో పూర్తిగా రోడ్లు శిథిలమై, ఎక్కడికక్కడ బురద గుంతలు తేలి డివిజన్‌కు రాకపోకలు కష్టతరమయ్యాయి. ఐదు నెలల క్రితం సుమలత రాజు ఆ డివిజన్ ద్వారం వద్ద రోడ్డుపై ఉన్న బురదలో కూర్చొని నిరసన ప్రదర్శన చేపట్టారు. ‘నమస్తే తెలంగాణ దినపత్రిక’లో మెయిన్ ఎడిషన్‌లో ప్రత్యేక కథ నం ప్రచురితమైంది. స్పందించిన నగర పాలక సంస్థ అధికారులు టీయూఎఫ్ఐడీసీ ద్వారా ఆ డివిజన్‌లో నూతన రోడ్డు నిర్మాణానికి రూ.60లక్షలు మంజూరు చేశారు. దీనితో ఆగమేఘాల మీద రోడ్డు పనులు పూర్తయ్యాయి. పట్టుబట్టి డివిజన్‌లో రోడ్డు వేయించి కష్టాలు తొలగించిన మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజుకు డివిజన్ ప్రజలు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ డివిజన్ సమస్యలపై ‘నమస్తే తెలంగాణ’లో ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో రోడ్డు మంజూరైందనీ, ఇది మా డివిజన్ ప్రజల విజయంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన నగర పాలక సంస్థ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

మంథని, జనవరి 31: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రమాదరహితంగా డ్రైవింగ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్లు జేడీ నాయక్, కే అశోక్, జీ లక్ష్మణ్‌లను ఆర్టీసీ అధికారులు సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. డీఎ శ్రవణ్‌కుమార్, ప్రభుత్వ దవాఖాన చీఫ్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఎంజెల్, ఎల్ హెచ్ శ్రీనివాస్, ఆర్‌హెచ్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్‌డీఐ గోపాల్, సూపర్‌వైజర్, సెక్యూరిటీ, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఖని డ్రైవర్‌కు సత్కారం

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 31: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్దపల్లిలో జరిగిన ముగింపు వేడుకల్లో గోదావరిఖని ఆర్టీసీ డిపో డ్రైవర్ ఎస్ తిరుపతిని రామగుండం సీపీ శ్రీనివాస్ సన్మానించారు. 29 సంవత్సరాలలో డ్రైవర్ తిరుపతి ఎలాంటి అక్సిడెంట్ లేకుండా బస్సు నడిపినందుకు సీపీ సన్మానంతో అభినందించారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

సుల్తానాబాద్, జనవరి 31 : భార్యాభర్తల మధ్య పంచాయితీ జరుగుతుండగా జరిగిన దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. మార్కండేయ కాలనీలో నివసిస్తున్న చింతల రాధ, శ్రీనివాస్ దంపతుల మధ్య మనస్పర్థలు రాగా, పెద్దల సమక్షంలో శుక్రవారం పంచాయితీ నిర్వహించారు. అదే కాలనీకి చెందిన చింతల ఆర్జున్, తూర్పాటి వంశీ, చింతల జనార్ధన్, చింతల బాలకృష్ణ కలిసి చింతల రాధ సోదరుడు పస్తం సాయినాథ్‌పై దాడి చేసి గాయపరిచారు. తలపై కొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. సాయినాథ్ సుల్తానాబాద్ పోలీసులకు పిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన ఎస్సై శ్రావణ్ కుమార్ గొడవకు కారణమైన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నంది పంప్ హౌస్ ద్వారా రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు

ధర్మారం,జనవరి31:నంది మేడారంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2కు అనుబంధంగా ఉన్న నంది రిజర్వాయర్ నుంచి రెండో విడతగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటి ఎత్తి పోతలు చేపట్టారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉన్న వేమునూర్ పంప్‌హౌస్‌లోని 4 మోటార్లు మొరాయించడంతో పైప్‌లైన్ ద్వారా ఎత్తిపోతలు జరగడం లేదు. విధిలేని స్థితిలో నీటి పారుదల శాఖ అధికారులు నంది పంప్ హౌస్ నుంచి జనవరి 16,17 తేదీలలో 6వ మోటార్ ఆన్‌చేసి నంది రిజర్వాయర్‌లోకి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటి పంపింగ్ చేసి నింపారు. ఈ రిజర్వాయర్ నిండటంతో ఇటు రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టుకు తూము ద్వారా నీటిని సరఫరా చేస్తూనే ఈ నెల 19 వ తేదీ నుంచి రిజర్వాయర్ వద్ద ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పంప్‌హౌస్ నుంచి ఒక మోటార్ తో పైపులైన్ ద్వారా 247 క్యూసెక్కుల చొప్పున నీటిని గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు, అక్కడ నుంచి కొడిమ్యాల,వేములవాడ కు సరఫరా చేస్తున్నారు. ఎగువకు నీటిని సరఫరా చేస్తున్న క్రమంలో నంది రిజర్వాయర్‌లో కనీస నీటి మట్టానికి చేరింది.ప్రస్తుతం 227.11 మీటర్ల నీటి మట్టం ఉన్నట్లు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ డీఈఈ బుచ్చిబాబు ‘నమస్తే తెలంగాణ’కు తెలిపారు. కాగా ప్రభుత్వం నుంచి ఆదేశాల రావటంతో రెండో విడతగా అధికారులు నంది రిజర్వాయర్‌ను నింపటానికి నంది పంప్‌హౌస్‌లోని రెండో మోటార్‌ను ఆన్ చేసి 3,150 క్యూసెక్కుల చొప్పున గురువారం రాత్రి 8 నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల దాకా నీటిని ఎత్తిపోశారు. తిరిగి శుక్రవారం రాత్రి అదే మోటార్‌ను నడిపి ఆ సమయం ప్రకారం నీటి ఎత్తిపోతలు చేపడుతున్నారు.230 మీటర్ల వరదదాకా నంది రిజర్వాయర్‌లోకి నీటిని నింపి మోటార్‌ను నిలిపి వేస్తామని అధికారులు తెలిపారు. వేమునూర్‌లో పంప్‌హౌస్‌లో నాలుగు మోటర్ల రిపేర్ జరుగుతుందన్నారు. అందులో ఒక మోటార్ మరమ్మతు పూర్తయి సిద్ధం కాగానే ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి పైపులైన్ ద్వారా నంది రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేస్తామని డీఈఈ బుచ్చిబాబు తెలిపారు. కాగా నంది రిజర్వాయర్‌తో పాటు నారాయణపూర్ రిజర్వాయర్ దానికి ఎగువన ఉన్న సాగు భూములకు కాళేశ్వరం అనుబంధ నంది పంప్‌హౌస్ ఆధారం కావడం కొసమెరుపు.

ప్రశంసా పత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

నేత్రదానంతో ఇద్దరికి చూపు

రామగిరి, జనవరి 31: సెంటినరీకాలనీకి చెందిన మాదారపు కేశవరావు కూతురు మమత సంస్మరణ సభ శుక్రవారం లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు కేశవరావు కుటుంబం తీసుకున్న నిర్ణయంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన వారయ్యారని అన్నారు. కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు నూక రమేశ్, కొండ సమ్మయ్య, కళాధర్ రెడ్డి, రామారావు, మేకల మారుతి, పాశం శ్రీనివాస్, సంతోష్, రాజశేఖర్, ప్రకాశ్, సురేందర్ రావు, శ్రీకాంత్ రావు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అవయవదాన అంగీకార పత్రం ఇస్తున్న ఎల్లస్వామి

అవయవదానానికి అంగీకారం

ఓదెల, జనవరి31: గూడెం మాజీ సర్పంచ్ గోవిందుల ఎల్లస్వామి మరణానంతరం తన అవయవాలను దానం చేసేందుకు సదాశయ ఫౌండేషన్ సభ్యులకు అంగీకార పత్రాన్ని అందజేశారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు భీష్మాచారి, ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ఎల్లస్వామిని అభినందించారు. ప్రశంసా పత్రంతో పాటు, ఐడీ కార్డు అందజేశారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు, మల్లేశం, ప్రసాద్, సారంగం, వేణు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

గౌతమీనగర్‌లో చోరీ

- రూ.15.20 లక్షలు లక్షలు అపహరణ

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 31: పట్టణంలోని గౌతమినగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరబడి తాళం పగుల గొట్టి రూ. 15.20 లక్షలు అపహరించారు. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇనుగంటి రామ్మోహన్‌రావు తన భార్యను వైద్యచికిత్స నిమిత్తం జనవరి 26న హైదరాబాద్‌కు తీసుకువెళ్లాడు. తిరిగి శుక్రవారం రాగా, ఇంటి డోర్ తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లో ఉన్న రూ. 15. 20లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి

మంథని, జనవరి 31: ప్రజాయుద్ధ నౌక గద్దర్ 77వ జయంతి వేడుకలను మంథని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కళాకారులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఢిల్లీ, శ్రీనివాస్, సమ్మయ్య, భావనన్న, రవి, మహేష్, నాగరాజు, దేవా, సురేష్, ఆంజలి, స్వరూపలు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఉద్యోగి పదవీరమణ

జ్యోతినగర్, జనవరి 31: ఎన్టీపీసీలో ఓఅండ్ఎం విభాగంలో పని చేసే ఆపరేటర్ ఐలయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు యాజమాన్యం టౌన్‌షిప్‌లోని అంబే ద్కర్ పార్కులో ఉద్యోగ విరమణ కుటుంబ సభ్యులతో మొక్కను నాటించారు. అనంతరం అడ్మిన్ బిల్డింగ్ అడిటోరియంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఐలయ్యను ఎన్టీపీసీ సీజీఎం చందన్ కుమార్ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఇక్కడ ఎన్టీపీసీ దీప్తి మహి ళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత, జీఎంలు, ఉన్నతాధికారులు ఉన్నారు.

పత్తి గరిష్ఠ ధర రూ. 7022

పెద్దపల్లి, జనవరి31: పెద్దపల్లి ఏఎంసీలో క్వింటాలు పత్తికి గరిష్ఠంగా రూ. 7022 ధర పలికింది. శుక్రవారం 1318 క్వింటాళ్ల పత్తిని ఖరీదుదారులు కొనుగోలు చేయగా, కనిష్ఠ ధర రూ. 5001, గరిష్ఠ ధర రూ. 7022 లభించిందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

గోదావరిఖని, జనవరి 31: ఆర్జీ-1లో శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఉద్యోగులను అధికారులు సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఎస్అండ్‌పీసీ విభాగంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించే జాటోత్ ఉమేశ్ ఉద్యోగవీరమణతో జీఎం కార్యాలయం సమావేశం హాల్‌లో ఏర్పాటు చేసిన విడ్కోల సమావేశంలో ఆర్జీ-1 ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్ పూలమాల వేసి శాలువతో సన్మానించారు. జీడీకే 1 ఇంక్లైన్‌లో జనరల్ మజ్దూర్ లైసెట్టి మల్లయ్య ఉద్యోగ వీరమణతో గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గని మేనేజర్ రమేశ్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ ఇక్బాల్ షరీఫ్ మల్లయ్య దంపతులను సన్మానించారు. ఇక్కడ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచీ సెక్రటరీ ఆరెల్లి పోశం, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఎన్విరామెంట్ డీజీఎం ఆంజనేయ ప్రసాద్, డీజీఎం ఎస్టేట్ కుమారస్వామి, డీజీఎం ఫారెస్ట్ కర్ణ, ఏఐటీయూసీ గని పిట్ సెక్రటరీలు రెడ్డి వెంకటస్వామి, మానాల శ్రీనివాస్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ అక్బల్ అలీ, నాయకులు ఎ సురేశ్, నేరెళ్ల తిరుపతి, గన్నెర్ల చంద్రయ్య, నరేశ్, ఏగోళపు శంకర్, కొప్పుల లింగయ్య, సంపత్‌రావు పాల్గొన్నారు.

రెండు ఎంపీటీసీ సీట్లు కేటాయించాలి

రామగిరి, జనవరి 31: కల్వచర్ల గ్రామానికి రెండు ఎంపీటీసీ సీట్లు కేటాయించాలని ఎంపీడీవోకు వివిధ పార్టీల నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సుమారు 4800 ఓట్లు, సుమారు 10వేల జనాభా కలిగిన కల్వచర్ల గ్రామానికి రెండు ఎంపీటీసీ సీట్లను కేటాయించడం ద్వారా మరొకరికి పరిపాలన సేవ అవకాశం లభిస్తుందన్నారు. ఇంతకంటే ఓట్లు తక్కువ ఉన్న పంచాయతీలకు రెండు, మూడు సీట్లు ఉన్నాయన్నారు. కల్వచర్లకు మాత్రం ఒకే ఎంపీటీసీ స్థానం ఉండడంతో ప్రజలకు, పాలకులకు కష్టతరమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మంథని నియోజక వర్గ ఇన్‌చార్జి రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శేఖర్, నాయకులు మోహన్ గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

రామగిరి, జనవరి 31: రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలకు సిద్ధం కావాలని ఎంపీడీవో శైలజారాణి సూచించారు. ఈమేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నియమావళిపై చర్చించారు. గ్రామాలలో వేసవి కాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా తగిన కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ ఉమేశ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శృతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

మారుపేర్ల బాధితులకు మద్దతు

గోదావరిఖని, జనవరి 31: సింగరేణిలో మారు పేర్లు డిపెండెంట్ల బాధితుల ఉద్యమానికి ఫైట్ ఫట్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ప్రకటనలో మద్దతు ప్రకటించారు. మారుపేర్ల సమస్యను యాజమాన్యం పట్టించుకోకపోవడం సరైందికాదని, మారుపేర్లు కలిగిన డిపెండెట్‌లకు సొంత పేరుతో ప్రత్యేక కేసుగా పరిగణంలోకి తీసుకోని ఉద్యోగాలు ఇవ్వా